(కథానిక) # భగ్నావశేషము

హిందీ: శ్రీమతి సుభద్రాకుమారిచౌహాన్
అనువాదం: యడవల్లి హేమలత

నేను కవిని కాను, రచయితను కాను, కాని నాకు కవిత్వం అంటే యిష్టం వుంది. ఎందుకు యిష్టమో నాకు తెలియదు. కాని యిష్టం మహాయిష్టం. నేను సాధారణంగా కవులందరి కవిత్వాన్నీ చదివేవాడిని, అంతే కాదు, అందులో నాకు ఏది బాగా నచ్చితే దాన్ని 'కటింగ్' నా దగ్గర వుంచుకొనేవాడిని.

ఒకసారి నేను రైల్లో ప్రయాణం చేస్తున్నాను. మధ్యలో నేను ఒకచోట రైలు మారాల్సి వచ్చింది. ఆ జంక్షను పెద్దదే కాని భోజనం వగైరాలు సరైనవి లభించవు, అందుకని నేను వూళ్లోకి వెళ్లాల్సి వచ్చింది. బజార్లోకి వెళ్లగానే, గోడల మీద పెద్ద పెద్ద పోస్టర్లు అతికించి వుండటం చూశాను. వాటిమీద, ఒక గొప్ప కవి సమ్మేళనం జరుగుతుందని వ్రాసి వుండటమే కాకుండా, కొంతమంది ప్రసిద్ధ కవుల పేర్లు కూడా వ్రాసి ఉన్నాయి. నన్ను ఆకర్షించటానికి కవి సమ్మేళనమే చాలు, అందులో కవుల పేర్లను చూసి నా ఉత్కంఠ అధికం కాసాగింది.

మరో బండికి వెళ్లటానికి నిశ్చయించుకొని నేను కవి సమ్మేళనం జరిగే చోటుకి వెళ్ళేటప్పటికే, అప్పుడే కవితాగానం ప్రారంభమై, ఒక ఉర్దూకవి ఆవేశపూర్ణమైనట్టి తన కవిత్వాన్ని సభా సదుల ఎదుట చదువుతున్నాడు. ప్రశంసలు ఎంత జోరుగా కొనసాగుతున్నాయంటే, కవిత్వం వినపడటం కూడా కష్టమైనది. నేను ఒక వైపు మెదలకుండా కూర్చున్నాను, కాని ఎంత ప్రయత్నించినా నా కళ్ళను స్థిమితంగా వుంచుకోలేకపోయాను. అవి ఎవరినో వెదకుటకై మాటి మాటికి విహ్వలత నొందుతున్నాయి. చాలమంది కవులు తమ తమ సుందరమైన కవిత్వాన్ని వినిపించారు. అందరి తరువాత ఒక స్త్రీ కూడా మెల్లి మెల్లిగా వేదిక వైపుకు వెళ్లటం కన్పించింది. ఆమె రూపురేఖా, ప్రవర్తనలనుబట్టి అమితమైన లజ్జా సంకోచాలు స్పష్టంగా గోచరమౌతున్నాయి. ఏదో విధంగా ఆమె కూడా తన కవిత్వాన్ని చదవటం ప్రారంభించింది. ప్రతి అక్షరం వేదనాభరితంగా వుండటంవల్ల శ్రోతలు ముగ్ధులై ఆ రచనలు వింటున్నారు. 'సెబాస్', 'బాగుంది' అనే ప్రశంసలు ఒక లెక్కా, ప్రజలు ఊపిరి పీల్చుకోవటం కూడా మానేశారా! అనేట్లుగా ఉన్నారు. నాలోని ప్రతిరోమం ఆ కవిత్వానికి స్వాగతం పలకటానికి ఉవ్విళ్లూరింది.

ఒకసారైనా యీ మూర్తీభవించినట్టి 'ప్రతిభయొక్క' పరిచయం పొందకుండా ఆనగరంనుండి వెళ్లటం అప్పుడు నాకు అసంభవమైంది. అందుకని అనిశ్చయాను సారంగా నేను ప్రయాణాన్ని మళ్లా కొంత కాలందాకా వాయిదావేశాను.

ఆ మర్నాడే ఆమె అడ్రసు కనుక్కొని పొద్దున సుమారు ఎనిమిది గంటలప్పుడు నేను ఆమె యింటికివెళ్లి, నా విజిటింగ్ కార్డు లోపలకు పంపించాను. వెంటనే ఒకాయన, నడివయస్సులో వున్నవాడు బయటకు రాగానే నేను ఉత్సాహంతో, శ్రీమతి ........ గారు యింట్లో ఉన్నారా? అని అడిగాను.

"ఉన్నది వచ్చి కూర్చోండి" అన్నాడు ఆయన.

"నిన్నటి కవి సమ్మేళనంలో నాకు ఆమె కవిత్వం చాలా నచ్చింది. ఒక సాహిత్య ప్రేమికుడి బాంధవ్యంలో, నేను ఆమెను కలుసుకో వచ్చునా?" అని అడిగాను ఆదరాన్ని సూచిస్తూ.

నన్ను కుర్చీమీద కూర్చోమంటూ ఆయన, ఆమె నా కుమార్తె నేను ఇప్పుడే పిలుస్తాను' అన్నాడు.

వెంటనే ఆయన పనివాడిద్వారా లోపలికి సమాచారాన్ని అందజేశాడు. కొద్ది నిముషాల తరువాత ఆమె వచ్చింది.

పరిచయమైన తరువాత చాలా సేపటి వరకు, సాహిత్యానికి సంబంధించిన అనేక విషయాలను గూర్చి మాట్లాడాము. తరువాత నేను వెళ్తానని అనగా, ఆమె నన్ను సాయంత్రానికి భోజనం అక్కడే చేయమని కోరింది. కాదని త్రోసిపుచ్చటం నాశక్తికి మించినపని. అందుకనే రోజంతా అక్కడే ఆమెతో వుండే సదవకాశం లభించింది. ఆకొద్ది గంటలలోనే ఆమె అసాధారణమైన ప్రతిభను చూసి ఆశ్చర్యపోయను, ఇంతముటుకు ఆమెఎడల వున్న నా ఆకర్షణ అకస్మాత్తుగా భక్తిగా పరిణమించింది.

భోజనమైన తరువాత చివరికి నా ప్రయాణం సాగించాల్సివచ్చింది. కాని దోవ పొడుగునా నేనేదో వస్తువును కోల్పోయి న్నటుగా బాధపడ్డాను.

ఇంటికి వెళ్ళిన తరువాత నేను ఆమెకు ఒకటి, రెండు ఉత్తరాలు వ్రాశాను కాని జవాబు ఒకదానికికూడా రాలేదు. వివశుడనైనందువలన మెదలకుండా ఊరుకోవాల్సి వచ్చింది. కాని ఆమె రచనల కొరకు ఎప్పుడూ అన్వేషణ సాగిస్తునే ఉన్నాను.

కాని కొన్ని రోజులనుండి ఆమె రచనలుకూడా కన్పించటంలేదు. ఎందుకో తెలియని అజ్ఞాతమైన సందేహంవుండుండి నన్ను భయభ్రాంతుడిని చేయసాగింది. చివరికి ఒకరోజున ఆమెను కలుసుకోవాలని నిశ్చయించుకొని యింటినుండి బయలు దేరాను నయము దేరటంతోటే ఎడమ కన్ను అదిరింది, పిల్లి ఎదురైంది. ఈ అపశకునాలు నాఅనిశ్చితమైన సందేహంతో పాటు, రాబోయే అమంగళానికి రూప మొసగినట్లున్నాయి. అక్కడికు వెళ్లిచూస్తే ఇంటికి తాళం వేసివున్నది నాగుండె గతుక్కుమంది. కనుక్కున్నమీదట, ఆమె తండ్రి మరణించి చాలా రోజులైందనీ, మేనమామ వచ్చి తనవెంట తీసుకువెళ్ళాడనీ తెలిసింది. ఎంతప్రయత్నించినా కూడా ఆమె మేనమామ యింటిని నేను తెలుసుకోలేకపోయాను. ఈ ప్రకారంగా

ఆమె ఒక గాలి విసురులాగా, నా జీవితంలో ప్రవేశించి వెళ్ళిపోయింది. కాని ఆమె విషయం నేను ఏమీ తెలుసుకోలేక పోయాను.

పది సంవత్సరాల తరువాత- నేను ఒకరోజున ఎక్కడికో ప్రయాణం చేస్తున్నాను. మధ్య ఒక పెద్ద జంక్షనులో రైలు మారుతుంది. నేను నా కంపార్టుమెంటులోంచి దిగాను. సరీగా నాకు సమీపంలోనే కాని, మూడవ తరగతి పెట్టెలో నుండి ఒక స్త్రీ క్రిందికి దిగింది. ఆమె వదనం అందంగా వుంది కాని ముకుళించుకొని వుంది, నేత్రాలు విశాలంగా వున్నాయి కాని దృక్కులు భీతావహంగా ఉన్నాయి. బట్టలు మామూలువే కాని కొస్త మాసి వున్నాయి. చంకలో ఏడాది పిల్లదు, దగ్గర యింకా యిద్దరు పిల్లలున్నారు. నేను ఒక్క అంగలో ఆమెను సమీపించగానే, అప్రయత్నంగా నా నోటినుండి, "మీరా! ఇక్కడ యీ విధంగా" అనే మాటలు వెలుపడినాయి

ఆమె నావైపు చూసింది. ఆమె నోటి నుండి ఒక్క చిన్న కేక వచ్చింది, వెంటనే సంబాళించుకుని "ఏమిటి మీరా?" అన్నది.

"అవును నేనే, కాని మీరు కవిత్వం వ్రాయటం ఎందుకు మానేశారు? అన్నాను.

అప్పటిదాకా వున్న ఆమె ఓర్పు కట్టలు త్రెంచుకుంది. ఆమె కళ్ళనుండి పెద్ద పెద్ద ముత్యాలు ఎన్ని రాలాయో తెలియదు. గద్గద కంఠంలో వ్రాయటం చదవటం గురించి యిప్పుడు నన్నుఏమీ అడగకండి' అన్నది.

ఇంతలోకే ఒకవైపునుంచి నడిచియొస్తూ ఒకడు వచ్చాడు. వచ్చీరావటంతో, ఆమె దగ్గరగా నేను నిలబడటం ఆపెద్ద మనిషికి నచ్చనట్లుంది, అందుకని ఆమెను చాలా అసహ్యంగా కసిరి "ఇక్కడ నిలబడి మాట్లాడుతున్నావా? నీకేమన్నా మతి ఉందా?" అన్నాడు.

"ఈయన మానాన్నగారి........ ఆమె వాక్యం పూర్తిగాకముందే ఆ మహాపురుషుడు "పరిచయం తరువాత చేద్దువుగాని పద!" అంటూ అరిచాడు.

ఆమె నావైపు వేదనాభరితమైనట్టి దృష్టిని పరపింది. ఆచూపులో ఎంత కరుణ, ఎంత వివశత, ఎంతభయం యిమిడివున్నాయి! ఆమె భర్త వెనుకాలే వెళ్ళింది.

ప్లాటుఫారంమీద నిలబడి, "యీమె ఆమేనా, లేక ఆమె భగ్నావశేషమా!" అని ఆలోచించసాగాను.

---

## చెయ్యనినేరం - వెయ్యనిశిక్ష

(౩౨ పేజీ తరువాయి)

'నీకు తెలీదే అమ్మా! నీకు తెలీదు... నీతో ఎట్లాచెప్పడమో అర్థం కాకుండా వుంది...'

'చెప్పేదేమిటో సరిగ్గా చెప్పరానాయనా!

'అదేనే చెపుదామని ప్రయత్నంచేస్తున్నాను!.... మరి అక్కయ్యకు తొందరగా పెళ్లిచేశేస్తేనే మంచిదే!....'

ఈమొక్క నేను ఎన్నాళ్ళబట్టీ మొత్తుకుంటూన్నాను. మీ నాన్నగారువింటేనేగా, నువ్వు ప్రయోజకుడివిఅవుతావేమో, మొగ బిడ్డవికదా అనుకుంటే ఇట్లాతయారయ్యావేను!.... అయినా ఇప్పుడు దానిపెళ్లిమాట ఎందుకు వచ్చిందిఅంట!

'అందుకుకాదే! నాకిప్పుడేమిటో జ్ఞాపకం వచ్చింది. అక్కయ్య, ఎవర్నో ప్రేమించిందిట అతన్నే పెళ్లిచేసుకుంటుందిట!...

'అదినీకొచ్చి చెప్పిందా? ...'

'అక్కయ్యే చెప్పాలేమిటే! ఊళ్లోఅంతా అనుకొంటున్నారు. రెండు రోజులాగితే అన్నీ నీకే తెలుస్తాయి. నేనేం చెప్పినా నువు నమ్మవులే!....

'అందుకుకాదునాయనా, నాకేం తెలుస్తుంది, ఊళ్లో ఏమనుకుంటున్నదీ! అసలు విషయం ఏమిటో చెప్పు.... నాకు అర్థమయ్యేటట్లు చెప్పు....

'నన్నేం చెప్పమంటావు, చెప్పాగా. మళ్ళీ నేను చెప్పానని తెలిస్తే నన్నంటుంది. నిరంజనరావుట.... అతనితో.... అదుగో భవానీ వస్తోంది....'

'ఏందాచిపెట్టావని వస్తున్నావు....'

'అదికాదే అమ్మ ఆఅమ్మాయియెవరో వచ్చిందని చెప్పలా. ఆ అమ్మాయి అంటోంది ఇక్కడే వుంటాను. అందుకనే వచ్చానంటోంది.'

అవును రమ్మను, ఇంకా ఇద్దర్ని వెంట బెట్టుకురాకపోయింది. తను ఒక్కర్తే వచ్చిందే! ఆఅమ్మాయికిపిచ్చా! నీకుపిచ్చా! ఏమిటిపద! నేను కనుక్కుంటాను ఏమిటో.... మళ్ళీ అహల్య ముందుకుసాగబోయింది.

[ సశేషం ]

---

## ప్రకటన

కృష్ణాజిల్లా కోర్టులో

OP. 19 – 20/61

Between

అబ్దుల్ రహీం — పిటీషనర్లు

and

హయాత్ బీబి — రెస్పాండెంట్లు

యీ నెంబరులో, షేకు యిబ్రహీం సాహేబుగారున్ను ఆయన భార్యా జులేఖాన్ బీగంగారున్ను చనిపోయినందున పిటీషనర్లు సదరు కుమ్రీలకు పిటీషనుతో జతపరచిన షెడ్యూలు దాఖలా బందరు స్టేటు బ్యాంకులో రావలసిన national savings సర్టిఫికేటు, బాండ్లు, account లకు పిటీషనర్లు వారసత్వపు సర్టిఫికేటు grant చేయించమని ఒక పిటీషనయున్ను, పిటీషనర్లలో 10 పిటీషనరు మయినరు అయినందునసదరు మయినర్కు అబ్దుల్ రహీంగార్ని గార్డియన్‌గా appoint చేయించమని ఒక పిటీషనుయున్ను పిటీషనర్లు పిటీషనులు దాఖలు చేసినందున యెవరికైనా యేమయినా ఆక్షేపణలున్న యెడల 29 6-61 తేదీకి సదరు కోర్టుకు పగలు 10 గంటలకు హాజరు అయి తెలుపుకోవలెను, లేనియెడల యక్సపార్టీ వుత్తర్వులు pass చేయుదురని యిందు మూలముగా విశదపరచటమైనది,

(Sd) మండల శ్రీనివాసరావు
పిటీషనర్ల తరపు అడ్వకేటు